సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



కమనీయం.. కడు రమణీయం

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి పొందిన వాడపల్లి దివ్యక్షేత్రంలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు రమణీయంగా జరుగుతున్నాయి.

8 లో



రత్నగిరిపై సంప్రోక్షణ పూజలు ప్రారంభం

అన్నవరం దేవస్థానంలో సంప్రోక్షణ పూజలు, శాంతి హోమాన్ని వేద పండితులు సోమవారం ప్రారంభించారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 2,94,263 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు సంబంధించి తూర్పు డెల్టాకు 2,700, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజ్ వద్ద నీటి మట్టం 10.80 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌కు 20 అర్జీలు



అర్జీదారుడితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 20 అర్జీలు వచ్చాయి. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా నిర్వహించిన ఈ గ్రీవెన్స్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదులు అందించారు. ఈ ఫిర్యాదులపై జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు కచ్చితంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. అమలాపురం హైస్కూల్ సెంటరులోని దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ దిమ్మకు టీడీపీ నాయకులు జెండాలు, ఫ్లెక్సీల కట్టడంపై చర్యలు తీసుకోవాలని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎక్కువగా ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు రాగా అర్జీదారులతో ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి ప్రయత్నించారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి వెండి వస్తువుల సమర్పణ



ఆలయ నిర్వాహకులకు వెండి పళ్లెం, శఠగోపం అందజేస్తున్న సతీష్‌కుమార్ దంపతులు

ముమ్మిడివరం: గాడిలంకలోని శ్రీసంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ఓ దాత రూ. లక్ష విలువ చేసే వెండి పళ్లెం, వెండి శఠగోపం సమర్పించారు. వీటిని విజయవాడకు చెందిన కాంట్రాక్టర్ సాయిచందు, యుక్తప్రియా దంపతుల కుమారుడు కార్తికేయ కియాన్ సమకూర్చారు. వారి తరఫున గాడిలంకకు చెందిన కొమ్మిరెడ్డి సతీష్‌కుమార్, దివ్యతేజ దంపతులు సోమవారం ఆలయ పురోహితుడు శేఖర్‌శర్మ సమక్షంలో నిర్వాహకులు గిరిగి సత్యసాయిరామ్, పిండి లక్ష్మణరావుకు అందజేశారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో కోచ్

అంబాజీపేట: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు అంబాజీపేట విద్యార్థినులు ఎంపికైనట్లు సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. సోమవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆ విద్యార్థులను పలువురు అభినందించారు. ఈ నెల 10 నుంచి 12 వరకూ బాపట్ల జిల్లా పేటేరు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్‌లో 20 కిలోల విభాగంలో కుడుపూడి కావ్య సుందరి హరి ప్రియ మొదటి స్థానం, 24 కిలోల విభాగంలో ఎరుబండి ఇషా నాగశ్రీనిజ రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచినందుకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. పంజాబ్‌లో త్వరలో జరగబోయే జాతీయ స్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్‌లో పాల్గొనున్నారన్నారు. ఈ విద్యార్థులు, కోచ్‌లు త్రిమూర్తులు, పితాని భార్గవి శ్రీకళ, నారాయణలను పలువురు అభినందించారు.

మెరుగైన ఉత్తీర్ణతకు ప్రణాళిక

అమలాపురం టౌన్: వచ్చే పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని డీఈఓ షేక్ సలీమ్‌బాషా సూచించారు. అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠ్యాంశ నిపుణులతో డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. సమగ్ర శిక్షా జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ (ఏసీపీ) జి.మమ్మీ మాట్లాడుతూ గత ఏడాది జిల్లా రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిందని గుర్తు చేశారు. ఈ ఏడాది మొదటి స్థానం సాధించే దిశగా ముందస్తు ప్రణాళికతో విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఈశ్వరరావు, సమగ్ర శిక్షా ఏఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ పి.రాంబాబు, జీసీడీఓ డాక్టర్ ఎంఏకే భీమారావు పాల్గొన్నారు.



అమలాపురంలో ఆందోళన చేస్తున్న ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, పార్టీ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్



రామచంద్రపురంలో వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ర్యాలీ

నకిలీ మందు పాతరేద్దాం

- సర్కారు మద్యం విధానంపై వైఎస్సార్ సీపీ కన్నెర్ర
- పోరుబాటకు దిగిన పార్టీ శ్రేణులు
- వర్షాన్నీ లెక్క చేయకుండా నిరసనలు
- ఎక్సైజ్ కార్యాలయాల వద్ద వినతిపత్రాలు

సాక్షి, అమలాపురం: ధన దాహంతో కూటమి నేతలు ఏరులై పారిస్తున్న నకిలీ మద్యానికి ఎన్నో పేద కుటుంబాలు బలవుతున్నాయి.. సర్కారు ఖజానా నింపుకొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న తప్పిదానికి ఓట్లు వేసి గెలిపించిన మహిళల బతుకులు ఎగతాళి అవుతున్నాయి. ఈ పరిస్థితులు చూసి విసిగిపోతున్న జనానికి వైఎస్సార్ సీపీ కొండంత అండగా నిలిచింది.. నకిలీ మద్యంపై సోమవారం పోరుబాటకు దిగింది. ప్రజల ప్రాణాలను హరిస్తున్న 'పచ్చ' తోడేళ్లను శిక్షించాలని నినాదాలు చేసింది. నకిలీ మద్యాన్ని ఏరులై పారిస్తున్న టీడీపీ నాయకుల వైఖరి, కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రణభేరి మోగించింది. ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ శ్రేణులు, మహిళలు రోడ్డెక్కి కదం తొక్కారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో ఎక్సైజ్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించి, తయారీదారులను కఠినంగా శిక్షించాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తెల్లవారు జాము నుంచి కురుస్తున్న వర్షం వైఎస్సార్ సీపీ శ్రేణుల కదనోత్సాహానికి చిన్నబోయింది. వానను సైతం లెక్క చేయకుండా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి, నకిలీ మద్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచారు. పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల విభాగాల, అనుబంధ సంఘాలకు చెందిన ప్రతినిధులు ఈ ఆందోళనలో పాలుపంచుకున్నారు.

అమలాపురం నియోజకవర్గంలో..

నకిలీ మద్యానికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రం అమలాపురంలో వైఎస్సార్ సీపీ ఆందోళన చేపట్టింది. భట్నవిల్లిలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నివాసం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకూ శ్రేణులు పాదయాత్ర చేశారు. పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు. నకిలీ మద్యాన్ని అరికట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి రామారావు (బాబి), పార్టీ ఎస్ఈసీ సభ్యులు కుడుపూడి వెంకటేశ్వరరావు (బాబు), కాశి బాల మునికుమారి, కుడుపూడి భరత్ భూషణ్, పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మహిళా విభాగం అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి, బూత్ కమిటీ అధ్యక్షుడు చీకట్ల కిషోర్ పాల్గొన్నారు.

పి.గన్నవరం..

పి.గన్నవరంలో నకిలీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు ఈ ర్యాలీలో పాల్గొని నకిలీ మద్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గన్నవరంలోని నియోజకవర్గం పార్టీ కార్యాలయం నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరిగి అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ పాదయాత్ర చేశారు. తహసీల్దార్ పి.శ్రీపల్లవికి వినతిపత్రం అందించారు. పార్టీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి పాల్గొన్నారు.



పి.గన్నవరంలో కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు సారథ్యంలో ఆందోళన

రామచంద్రపురం..

నకిలీ మద్యానికి వ్యతిరేకంగా రామచంద్రపురంలో నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కదం తొక్కారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు, మహిళలు నకిలీ మద్యానికి వ్యతిరేకంగా నినదించారు. పట్టణంలో పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకూ భారీ పాదయాత్ర నిర్వహించారు. నకిలీ మద్యం అరికట్టాలని, దోషులను శిక్షించాలని నినాదాలతో హోరెత్తించారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాసరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

రాజోలు..

నకిలీ మద్యానికి వ్యతిరేకంగా రాజోలులో ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ ఆందోళనకు దిగింది. పార్టీ కో ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. సూర్యారావు మాట్లాడుతూ నకిలీ మద్యం కారణంగా ఎంతోమంది పేదలు ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రాజోలు ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్యకుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజ చినరాజా తదితరులు పాల్గొన్నారు.



రాజోలులో ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు తదితరులు

కొత్తపేట..

నియోజకవర్గ కేంద్రం కొత్తపేటలో వైఎస్సార్ సీపీ శ్రేణులు నకిలీ మద్యానికి వ్యతిరేకంగా భారీ పాదయాత్ర నిర్వహించాయి. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్ రాజు ఇంటి వద్ద నుంచి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వరకూ పాదయాత్ర చేశారు. ప్రభుత్వ మద్యం విధానాలకు వ్యతిరేకంగా మద్యం సీసాలు, ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయనికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. పార్టీ శ్రేణులతో పాటు మహిళలు తరలివచ్చారు. ఈ సందర్భంగా నకిలీ మద్యం అరికట్టాలని, దోషులను శిక్షించాలని నినాదాలు చేశారు. నియోజకవర్గ పరిశీలకుడు పాటి శివకుమార్, గొల్లపల్లి డేవిడ్‌రాజు పాల్గొన్నారు.



కొత్తపేటలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

బాణసంచా బాధిత కుటుంబాలను ఆదుకోండి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): రాయవరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఇటీవల సంభవించిన ప్రమాదంలో మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని, ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణలతో కలసి విలేకరులతో మాట్లాడారు. బాణసంచా తయారీ కేంద్రాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు సంబంధిత నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. పని ప్రదేశంలో ఉండే కార్మికులకు తప్పనిసరిగా బీమా చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మానవత్వంతో ఆలోచించి బాధిత కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, నాయకులు పిల్లా వీరబాబు, మందపల్లి రవికుమార్, జొన్నపల్లి సత్తిబాబు, తణుకు అశోక్, యరమాటి వెంకన్న బాబు, టేకుమూడి శ్రీనివాస్, ముమ్మిడివరపు బాపిరాజు, టపా పుల్లేశ్వరరావు, కుడిపూడి రాంబాబు, నాగులపల్లి రామకృష్ణ, చిన్ని గంగాధరం, కొడమంచిలి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పాపారాయుడు, రాధాకృష్ణ

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడొద్దు

- నకిలీ మద్యంపై చర్యలు తీసుకోండి
- సీపీఎం జిల్లా నేతల డిమాండ్

అమలాపురం టౌన్: కల్తీ, నకిలీ మద్యాన్ని ఏరులై పారిస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతుందని సీపీఎం జిల్లా శాఖ దుయ్యబట్టింది. నకిలీ మద్యం మాఫియాపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. మద్యం నాణ్యతను పర్యవేక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆందోళన వ్యక్తం చేసింది. అమలాపురంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తదితరులు సోమవారం సమావేశమై నకిలీ మద్యం అదుపు వైఫల్యంపై చర్చించారు. ఈ కల్తీ మద్యం రాకెట్ వెనుక రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులు ఉండడంతో వారు ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతోనే ఈ మాఫియా నడిపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మద్యం ద్వారా వచ్చే ఆదాయంపైనే ప్రత్యేక దృష్టి పెట్టిందే తప్ప, దానివల్ల వచ్చే దుష్పరిణామాలు, దెబ్బతింటున్న ప్రజారోగ్యాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లాలోని అల్లవరం మండలం కొమరిగిరపట్నంలో ఇటీవల కాలంలో నకిలీ మద్యం యూనిట్ వెలుగు చూసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఇదే పరిస్థితి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బయటపడడం చూస్తుంటే మొత్తం రాష్ట్రం కల్తీ మద్యమయ్యే పరిస్థితులు అనివార్యమవుతున్నాయని వారు ఆరోపించారు.

నకిలీ లేబుళ్లు, రసాయనాలు, రంగులతో కల్తీ మద్యం మాఫియా చెలరేగిపోతోందని విమర్శించారు. మద్యం తాగి ఎవరైనా అనారోగ్యం పాలైతే ప్రభుత్వమే ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యంపై తక్షణ చర్యలు తీసుకోకపోతే సీపీఎం జిల్లా శాఖ ప్రత్యేక ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు.

జిల్లా సీపీఎం నాయకులు జి.దుర్గాప్రసాద్, బలరామ్, టి.నాగవరలక్ష్మి, కె.కృష్ణవేణి, పీతల రామచంద్రరావు, తాడి రామ్మూర్తి, సఖిలే సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నకిలీ మద్యంపై మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు తదితరులు

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: జిల్లాలో రైతు సేవా కేంద్రాల ద్వారా ఖరీఫ్ ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ప్రచార వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ- పంట, ఈకేవైసీ నమోదు చేయాలన్నారు. పంట కోతల తేదీల ఆధారంగా రైతులకు కూపన్లు జారీ చేయాలన్నారు. జేసీ నిషాంతి మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1967 లేదా కంట్రోల్ రూమ్ నంబర్లు 83094 32487, 94416 92275లలో సంప్రదించాలన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన రెండు దశల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికలు పూర్తి చేయాలని కలెక్టర్ మహేష్ కుమార్ సంబంధిత గ్రామీణాభివృద్ధి అధికారులను ఆదేశించారు. పీఎం ఏజేవై పథక అమలు తీరుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన ద్వారా ఎస్సీ, ఎస్టీ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, ఆర్థిక అభివృద్ధి, పారిశుధ్యం వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలుకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. సుమారు 110 అర్జీలను కలెక్టర్‌తో పాటు జేసీ టి.నిషాంతి, డీఆర్వో కె.మాధవి, డ్వామా పీడీ మధుసూదన్‌లు స్వీకరించారు. సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మీ, డీఈఓ షేక్ సలీం బాషా, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏవీఎస్ రామన్ పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

సాక్షి, అమలాపురం: నైరుతి నిష్క్రమణ తరుణంలో జిల్లాలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం 11 గంటల వరకూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. జిల్లా వ్యాప్తంగా ఉదయం 8 గంటల వరకు సగటున 10.4 మిల్లీమీటర్ల వర్షం పడగా అత్యధికంగా అయినవిల్లి మండలంలో 25 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కాట్రేనికోన మండలంలో 0.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. 8 గంటల తరువాత కూడా వర్షం పడుతూనే ఉంది. అమలాపురంలో ప్రధాన రోడ్లపై నీరు నిలిచిపోయింది. ఆత్రేయపురం మండలంలో 4.8 మిల్లీమీటర్లు, మండపేట 5.0, రాయవరం 3.0, రామచంద్రపురం 12.4, ఆలమూరు 10.2, రావులపాలెం 19.2, కొత్తపేట 14, కపిలేశ్వరపురం 4.2, కె.గంగవరం 7, ఐ.పోలవరం 16.8, ముమ్మిడివరం 10.2, అయినవిల్లి 25, పి.గన్నవరం 12.6, అంబాజీపేట 15.8, మామిడికుదురు 13.2, రాజోలు 5.8, మలికిపురం 7.6, సఖినేటిపల్లి 0.6, అల్లవరం 6.2. అమలాపురం 9.2, ఉప్పలగుప్తం 12.4, కాట్రేనికోన 14.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



అప్పనపల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 22,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 25,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 25,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

రోడ్డు ప్రమాదంలో రికార్డ్ అసిస్టెంట్ మృతి



శ్రీనివాస్ (ఫైల్)

అనపర్తి, రాయవరం: రోడ్డు ప్రమాదంలో జూనియర్ కళాశాల రికార్డ్ అసిస్టెంట్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కడియం మండలం వేమగిరి గ్రామానికి చెందిన మట్టపర్తి శ్రీనివాస్ (52) రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. రోజూలాగే వేమగిరి నుంచి అనపర్తి కొప్పవరం మీదుగా రాయవరంలోని కళాశాలకు బయలుదేరారు. తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తుండడంతో కొప్పవరం గ్రామ శివారుకు చేరుకునే సరికి ఆయన బైక్ రోడ్డుపై జారిపోయింది. వాహనంతో పాటు ఆయన రోడ్డుపై పడిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకోగా స్థానికులు గమనించారు. ఆయన జేబులోని సెల్‌ఫోన్ తీసి రాయవరం కళాశాలలోని సహోద్యోగులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి హుటాహుటిన అనపర్తి ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందారు. ఈ మేరకు ట్రైనీ ఎస్సై సుజాత కేసు నమోదు చేశారు.



వాడపల్లిలో శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



స్వామివారికి పూజలు చేస్తున్న ఈఓ చక్రధరరావు, వెంకట్రాజు



ఆకట్టుకున్న మహిళల సాంస్కృతిక ప్రదర్శన

కమనీయం.. కడు రమణీయం

- వాడపల్లిలో శ్రీనివాసుని కల్యాణం
- కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- యోగనారసింహ అలంకరణలో శ్రీవారు విహారం

కొత్తపేట: శ్రీవారు ఓరకంట చూడగా.. అమ్మవారు సిగ్గులమొగ్గగా మారగా.. జగద్రక్షకుడి కల్యాణం కన్నుల పండువగా జరగ్గా.. ఈ క్రతువును తిలకించిన భక్తజనం మురిసిపోగా.. కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రంలో శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శ్రీనివాసుని కల్యాణం అట్టహాసంగా జరిగింది. బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవం చూసిన కనులదే భాగ్యం అన్నట్లు సాగింది. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనం కల్యాణోత్సవాన్ని, వాహన సేవను తిలకించి పులకించింది. ఈ సందర్భంగా గోవింద నామస్మరణతో వాడపల్లి క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్య చక్రధరరావు పర్యవేక్షణలో వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, అర్చక బృందం, వివిధ ప్రాంతాల వేద పండితులు ఉదయం నుంచి రాత్రి వరకూ నిరంతరాయంగా స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు తదితర పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అష్టకలశారాధన, మహాస్నపనం, ప్రధాన హోమాలు, నీరాజన మంత్రపుష్పం, దిగ్దేవతా బలిహరణ తదితర పూజలు నిర్వహించారు.



సింహ వాహనంపై యోగనారసింహ అలంకరణలో శ్రీవారి ఊరేగింపు

కనుల వైకుంఠం.. శ్రీనివాసుని కల్యాణం

లోక సంక్షేమార్థం శ్రీనివాసుని కల్యాణ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ప్రదానం నుంచి తలంబ్రాల వరకూ వేదపండితుల వ్యాఖ్యానం నడుమ వైభవంగా నిర్వహించారు. సర్వాభరణ భూషితులైన స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి తీసుకువచ్చి మండపంలో అలంకరించారు. దేవస్థానం తరపున డీసీ అండ్ ఈఓ చక్రధరరావు దంపతులు, ఉత్సవ కమిటీ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, కల్యాణ మాలలు తదితరాలు సమర్పించారు. నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర బెల్లం ధరింపజేసి, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. సాయంత్రం 5.30 గంటల నుంచి స్వస్తివచనం, ప్రధాన హోమాలు, స్వామివారికి విశేషార్చన, చతుర్వేద స్వస్తి, నీరాజన మంత్రపుష్పం జరిపారు.

నేటి కార్యక్రమాలు ఇవీ..

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం బ్రహ్మోత్సవాల నిత్య పూజలు, హోమాలు, అభిషేకాలతో పాటు ఉదయం వసంతోత్సవం, అష్టదళ పాదపద్మారాధన నిర్వహిస్తారు. సాయంత్రం హనుమత్ మూలమంత్ర హవనం, అష్టోత్తర శత కలశారాధన, పంచశయ్యాధివాసం విశేష పూజలు, సేవలు, రాత్రి మలయప్ప అలంకరణతో గరుడ వాహనసేవ నిర్వహిస్తారు.

సింహ వాహనంపై ఊరేగిన శ్రీవారు

శ్రీవారు యోగనారసింహ అలంకరణలో సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి సింహ వాహనంపై స్వామివారిని అలంకరించగా, మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పండితులు సింహ వాహనంపై శ్రీవారు విహార ఘట్టం విశిష్టతను వివరించారు. ఈ ఘట్టం భక్తులకు ఐశ్వర్యం, యశస్సు, శ్రీ, జ్ఞానం తదితర గుణాలను ప్రసాదిస్తారని అర్థం. సింహం ధైర్యం, వేగం, చురుకుదనానికి ప్రతీక. కాబట్టి స్వామివారు ఈ వాహనంపై ఊరేగుతూ పైలక్షణాలను అనుగ్రహిస్తారు. యోగనారసింహ రూపంలో శ్రీవారిని దర్శించిన వారికి మంచి జరుగుతుందని వివరించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేంకటేశ్వర స్వామివారి వేషధారణలో ఒక కళాకారుడు ఆకట్టుకున్నారు. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్సై రాము బందోబస్తు నిర్వహించారు.



వేంకటేశ్వరస్వామి వేషధారణలో ఓ కళాకారుడు

షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక



రాష్ట్ర స్థాయి అండర్–19 షటిల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైన బాలికలు



ఎంపికైన బాలురు

పెదపూడి: క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని జి.మామిడాడ జీఆర్ఎస్‌ఏ ఫ్యామిలీ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి భాస్కరరెడ్డి, లయన్స్ క్లబ్ అడ్మిన్ మండ రాజారెడ్డి అన్నారు. జి.మామిడాడలోని జీఆర్ఎస్‌ఏ ఫ్యామిలీ హెల్త్ క్లబ్ ద్వారంపూడి దివాకర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్–19 బాలుర, బాలికల విభాగాల్లో షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా జట్ల ఎంపికలు సోమవారం జరిగాయి. ముఖ్య అతిథులుగా ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి, మండ రాజారెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పడాల గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎంపికలు స్థానిక లయన్స్ క్లబ్, జీఆర్ఎస్‌ఏ ఫ్యామిలీ హెల్త్ క్లబ్ సహకారంతో నిర్వహించామన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున పాల్గొంటారన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ సెలక్షన్ కమిటీ సభ్యులు టీఎస్‌వీఆర్ మూర్తి, ఫిజికల్ డైరెక్టర్లు ద్వారంపూడి యువరాజారెడ్డి, నల్లమిల్లి అప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగాంలో కొండముచ్చు దాడి

ఐదుగురికి తీవ్ర గాయాలు

అయినవిల్లి: మాగం గ్రామంలో ఓ కొండముచ్చు రెండు రోజుల్లో ఐదుగురిపై దాడి చేసింది. ఆ గ్రామానికి చెందిన బి.సత్యనారాయణ, బొడపాటి రాజేష్, కొట్టల శ్రీనులు పొలం నుంచి ఇంటికి వస్తుండగా మార్గ మధ్యంలో కొండముచ్చు దాడి చేసి గాయపరిచింది. ఇలా మరో ఇద్దరిని తీవ్రంగా గాయపరిచిందని గ్రామస్తులు చెప్పారు. బాధితులు అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కొండముచ్చు దాడి ఘటనపై అటవీ శాఖ అధికారులకు పంచాయతీ అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. గతంలో కూడా 15 మందిపై దాడి చేసినా అధికారులు స్పందించలేదని అంటున్నారు. ఇప్పటికైనా కొండముచ్చులను అదుపులోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కొండముచ్చు దాడిలో రాజేష్ కాలికి గాయం

రత్నగిరిపై సంప్రోక్షణ పూజలు ప్రారంభం




రత్నగిరిపై సంప్రోక్షణ పూజలు, శాంతి హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సంప్రోక్షణ పూజలు, శాంతి హోమం సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఆలయంలోని దర్బారు మండపంలో ఉదయం తొమ్మిది గంటలకు ఈ పూజలు, హోమాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. తొలుత కలశాలతో మండపారాధన చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య ఈ పూజలు నిర్వహించారు. తర్వాత శాంతి హోమానికి అంకురార్పణ చేశారు. అన్నవరం దేవస్థానంలో కొన్ని నెలలుగా అనేక అగ్ని ప్రమాదాలు, అపశ్రుతులు జరిగిన నేపథ్యంలో ఈ సంప్రోక్షణ పూజలు, శాంతి హోమం నిర్వహిస్తున్నట్లు పండితులు తెలిపారు. బుధవారం ఉదయం శాంతి హోమం పూర్ణాహుతితో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. తరువాత మంత్ర జలాన్ని దేవస్థానం ఆవరణలో వెదజల్లి శుద్ధి చేస్తారు. దేవస్థానంలో చాలాకాలంగా సంప్రోక్షణ పూజలు కాని, ప్రత్యేక యాగాలు, కోటి తులసి పూజలు కాని జరగకపోవడంతో మూడు నెలల నుంచి అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు పండితులు, అర్చకస్వాములు అభిప్రాయపడ్డారు. దీనిపై ఈ నెల 7న 'సాక్షి' దినపత్రికలో 'అపశ్రుతులు అందుకేనా..?' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దానికి దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు స్పందించి శాంతి పూజలు నిర్వహించాలని దేవస్థానం పండితులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పూజల్లో చైర్మన్ ఐవీ రోహిత్‌తో పాటు వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరబట్ల గంగబాబు, చిట్టి శివ, యనమండ్ర శర్మ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు దత్తాత్రేయ శర్మ, కంచిబట్ల సాయిరామ్, కల్యాణ బ్రహ్మ ఛామర్తి కన్నబాబు తదితర బృందం పాల్గొన్నారు.

కళాశాల బస్సును ఢీకొన్న వ్యాన్

13 మంది విద్యార్థులకు గాయాలు

దేవరపల్లి: ప్రైవేటు కళాశాల బస్సును బొలెరో వ్యాన్ ఢీకొన్న ఘటనలో బస్సులోని 13 మంది విద్యార్థులు గాయపడ్డారు. ఇందులో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా, మిగిలిన విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి వద్ద ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు సుమారు 40 మంది విద్యార్థులతో సోమవారం ఉదయం కళాశాలకు వెళుతుండగా, కృష్ణంపాలెం వద్దకు వచ్చేసరికి విజయవాడ నుంచి రాజమహేంద్రవరానికి కిరాణా సరకులతో వెళుతున్న వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆరుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మిగిలిన విద్యార్థులకు స్వల్ప గాయాలు కాగా స్థానిక పీహెచ్‌సీలో వైద్యం చేసి ఇళ్లకు పంపించారు. వ్యాన్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.



కృష్ణంపాలెం వద్ద ప్రైవేట్ కళాశాల బస్సును ఢీకొని నుజ్జయిన వ్యాన్

భార్య మందలించిందని ఆత్మహత్య

కొత్తపేట: రోజూ మద్యం తాగి వస్తున్నాడని భార్య మందలించడంతో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై జి.సురేంద్ర కథనం ప్రకారం.. పలివెల శేరిపాలెం గ్రామానికి చెందిన అరిగెల నాగభూషణం (34) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చి తన పడక గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. భార్య తలుపుకొట్టినా తీయలేదు. దానితో ఆమె ఇంటి పక్కనే ఉన్నవారిని పిలవగా వారు వచ్చి బలవంతంగా తలుపులు తీసి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. వెంటనే కిందకు దించి కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. నాగభూషణం మద్యానికి బానిస కావడంతో భార్య మందలించిందనే మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై తెలిపారు.